మందుబాబులకు చెక్ చెప్పాలి



ఆస్పత్రిలో వైద్యం కోసం రోగులను తీసుకొచ్చేవారు, రోగులను పరామర్శించడానికి వస్తున్న వారిలో కొందరు మద్యం తాగుతున్నారు. అలాంటి వారు ఆస్పత్రుల్లో వైద్యులు, నర్సింగ్ సిబ్బందిపై ఎక్కువగా వాదనలకు దిగుతున్నారు. మా పేషెంట్‌కు ఇంకా తగ్గలేదు, మీరు సరిగా వైద్యం చేయడంలేదంటూ మద్యం మత్తులో వారు వాదనకు దిగుతున్నారు. అలాంటి వారితో ఆస్పత్రుల్లో ఘర్షణ వాతావరణం ఏర్పడుతోంది. ఆస్పత్రుల వద్ద మరింత సెక్యూరిటీ ఏర్పాటు చేసి మద్యం తాగి ఉన్నవారిని లోపలకి వదలకుండా కఠినమైన చర్యలు చేపట్టాలి.

– డాక్టర్ రాజేష్ వెంకట్, న్యూరో ఫిజిషియన్

నిరంతరం సెక్యూరిటీ ఉండాలి



ప్రతి ఆస్పత్రిలో రాత్రి, పగలు తేడా లేకుండా నిరంతరం పటిష్టమైన సెక్యూరిటీ అవసరం. ఆస్పత్రులకు అందుబాటులో ఉండే పోలీస్ స్టేషన్ నుంచి పోలీసులు నిఘా పెట్టాలి. మెడికలార్జికల్ కేసులకు వైద్య సేవలు అందించినప్పుడు పోలీసులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలి. ఆస్పత్రుల్లో నిరంతరం సీసీ కెమెరాలు పనిచేయాలి. నైట్ డ్యూటీ చేసే వారి కోసం నైట్ ట్రాన్స్‌పోర్ట్ సౌకర్యం కల్పించాలి. ప్రభుత్వ ఆస్పత్రులకు దగ్గరలో ప్రత్యేకంగా బస్ స్టాప్‌లు ఏర్పాటు చేయాలి. ఆస్పత్రుల సిబ్బందికి ప్రత్యేకంగా హెల్ప్‌లైన్ నంబర్ పెట్టాలి. దీని వల్ల వెంటనే సమస్య అధికారులకు చేరవేయడానికి వీలు కలుగుతుంది.

– డాక్టర్ అనిత, గైనకాలజిస్ట్, ఆరిలోవ ఆస్పత్రి వైద్యాధికారి

క్లుప్తంగా

ఏయూ హాస్టళ్లు, మెస్‌ల తనిఖీ



మెస్‌లో టిఫిన్ రుచి చూస్తున్న ఏయూ రెక్టార్ కిషోర్‌బాబు

విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం హాస్టళ్లు, మెస్‌లను సోమవారం ఏయూ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రెక్టార్ ఆచార్య ఎన్.కిషోర్‌బాబు, ప్రిన్సిపాల్స్ ఆచార్య ఎ.నరసింహారావు, ఎం.వి.ఆర్.రాజు, చీఫ్ వార్డెన్‌లు ఆచార్య ఎస్.హరనాథ్, ఆచార్య కె.రమేష్ బాబు ముందుగా మెస్‌లలో భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు అందించే టిఫిన్‌ను స్వయంగా రుచిచూశారు. విద్యార్థులకు రుచికరమైన ఆహారాన్ని అందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం విద్యార్థుల హాస్టళ్లు తనిఖీ చేశారు. వారికి వసతి కల్పిస్తున్న విధానాన్ని ప్రత్యక్షంగా గమనించారు.

మొక్కలతో పర్యావరణానికి మేలు



మత్స్యకార పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

ఎంవీపీకాలనీ: జీవీఎంసీ 19వ వార్డు వాసవానిపాలెం ప్రభుత్వ మత్స్యకార పాఠశాలలో ద్వారకానగర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం సేవా కార్యక్రమం నిర్వహించారు. డౌన్ టు డస్క్ ప్రోగ్రాంలో భాగంగా పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి క్లబ్ ప్రతినిధులు మొక్కలు నాటారు. మొక్కలు నాటడం, వాటిని పరిరక్షించడం ద్వారా కాలుష్య రహిత వాతావరణానికి విద్యార్థులు బాటలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో లయన్స్ గవర్నర్ ఆచార్య ఎన్.వి.బి.ఎస్.ఎస్.ప్రసాద్, వైస్ గవర్నర్ డి.సూర్యప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

19 కేజీల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరిని విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో రైల్వే పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 19 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో రైల్వే భద్రతా దళం సబ్ ఇన్‌స్పెక్టర్ వి.కీర్తిరెడ్డి సిబ్బందితో సోమవారం తనిఖీలు చేశారు. ఆ సమయంలో ఢిల్లీకి చెందిన షాకిబ్ ఆలీ, ముంబయికి చెందిన శంకర్ తెవతియా బిశ్వాల్ వద్ద గంజాయి గుర్తించారు. వారు విశాఖపట్నం రైల్వే స్టేషన్ మీదుగా ఢిల్లీ, ముంబయికి గంజాయి తరలిస్తున్నట్లు గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకుని 19 కేజీల గంజాయి స్వాధీనం చేసుకుని జీఆర్పీ ఎస్ఐ ఎస్.రామారావుకు అప్పగించారు. వీరిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు సిబ్బంది తెలిపారు.

లలితా పీఠంలో చండీ హోమం



హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

సీతంపేట: శ్రావణమాసం బహుళ అష్టమి సందర్భంగా శ్రీలలితాపీఠంలో విశేష పూజలు సోమవారం నిర్వహించారు. ఉదయం చండీ హోమం, సాయంత్రం కాల భైరవ హోమం నిర్వహించారు. పండితుల వేదమంత్రాల మధ్య శాస్త్రోక్తంగా హోమాలు జరిపించారు. అష్టమి రోహిణి నక్షత్రం సందర్భంగా మంగళవారం ఉదయం శ్రీరాధాకృష్ణులకు విశేష పూజలు నిర్వహిస్తామని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

ఫుట్‌పాత్‌లే పార్కింగ్ స్థలాలు

- బీచ్ రోడ్డులో కాలిబాటలపై వాహనాల నిలుపుదల
- నడిచేందుకు ఇబ్బంది పడుతున్న సందర్శకులు
- పట్టించుకోని పెట్రోలింగ్ పోలీసులు



బీచ్ వద్ద పార్కింగ్ స్థలంలో కుర్చీలు



బీచ్ రోడ్డులో ఫుట్‌పాత్‌పై పార్క్‌చేసిన ద్విచక్ర వాహనాలు

బీచ్‌రోడ్డు: సుందరమైన, విశాలమైన సాగరతీరాన్ని చూస్తూ నడుస్తుంటే ఆ ఫీల్ వేరుగా ఉంటుంది. సందర్శకులకు అటువంటి అనుభూతిని అందించేందుకు జీవీఎంసీ కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఫుట్‌పాత్‌లను విస్తరించింది. బీచ్ రోడ్డులో సందర్శకుల కోసం తీర్చిదిద్దిన ఆ కాలిబాటలు కాస్తా పార్కింగ్ స్థలాలుగా మారాయి. ఇక్కడ గల కొన్ని హోటళ్లకు వచ్చే అతిథులు, బీచ్ సందర్శకులు తమ వాహనాలను ఆ ఫుట్‌పాత్‌ల మీదే పార్క్‌చేసి వెళ్తున్నారు. నడుచుకుంటూ వెళ్లాలనుకునే సందర్శకులు, స్థానికులు ఫుట్‌పాత్‌పై వాహనాలతో ఇబ్బంది పడుతున్నారు.

పార్కింగ్ స్థలం ఉన్నా..

ఆర్కే బీచ్ రోడ్డులోని రెండు హోటళ్లకు లోపల వాహనాల పార్కింగ్ కోసం స్థలం ఉంది. వీరు మాత్రం ద్విచక్ర వాహనాలను లోపలికి అనుమతించారు. కేవలం ఆ హోటళ్లలో పనిచేస్తున్న వారి వాహనాలను మాత్రమే అక్కడ పార్కింగ్ చేయనిస్తారు. హోటల్‌కు వచ్చిన అతిథులను మాత్రం వారి వాహనాలను ఫుట్‌పాత్‌పై పార్క్‌చేయాలని సూచిస్తారు. ఇక్కడ ఎందుకు చేయాలని ప్రశ్నిస్తే.. ఈ పార్కింగ్ స్థలం కూడా తమదేనని హోటళ్ల నిర్వాహకులు చెబుతుంటారు. దీతో ఫుట్‌పాత్‌పైనే ద్విచక్ర వాహనాలను పార్క్‌చేస్తున్నారు.

అక్కడే పోలీసుల పెట్రోలింగ్..

బీచ్ రోడ్డులో ఫుట్‌పాత్‌లను పార్కింగ్ స్థలంగా మార్చేసిన దగ్గరే పోలీసులు నిరంతరం పెట్రోలింగ్ చేస్తుంటారు. అక్కడే వారి వాహనం నిలిపి విధులు నిర్వర్తిస్తుంటారు. ఫుట్‌పాత్‌పై వాహనాలు నిలపకుండా ఎటువంటి చర్యలు తీసుకోరు. పోని హోటల్ పార్కింగ్ స్థలం నిండిపోవటం వల్ల బయట వాహనాలు పెడుతున్నారా అంటే అది కూడా కాదు. పార్కింగ్ స్థలం ఖాళీగానే ఉంటుంది. అయినే సరే బయటే పార్కింగ్ చేయాలని హోటళ్ల సిబ్బంది సూచిస్తారు. దీన్ని పోలీసులు కూడా పట్టించుకోరు. దీంతో ఆర్కే బీచ్ రోడ్డులో సాయంత్రం వేళ నడుచుకుంటూ వెళ్లే సందర్శకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వానానాలు వెళ్తున్నా.. రోడ్డుపై నుంచే నడుస్తూ ఆర్కే బీచ్‌కు చేరుకుంటున్నారు.



హోటల్ వద్ద ఫుట్‌పాత్‌పై పార్క్‌చేసిన ద్విచక్ర వాహనాలు

పార్కింగ్ స్థలంలో ఫుడ్‌కోర్టు..

సాగరతీరానికి వచ్చే సందర్శకులు తమ వాహనాలు పార్కింగ్ చేసుకునేందుకు జీవీఎంసీ పలు స్థలాలను కేటాయించింది. వైఎంసీఏ ఎదురుగా, హోటల్ అంబికా సీ గ్రీన్ ఎదురుగా ఈ పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేసింది. ఆ స్థలాల్లో మొబైల్ ఫుడ్ కోర్టులు పెట్టుకొని పార్కింగ్ చేయాల్సిన స్థలంలో కుర్చీలతో నింపేస్తున్నారు. దీంతో అక్కడ వాహనాలు నిలిపేందుకు స్థలం లేకుండా పోతోంది. బీచ్ రోడ్డులోని ఫుట్‌పాత్‌లపై ద్విచక్ర వాహనాలు నిలపకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని పలువురు సందర్శకులు కోరుతున్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



స్పోర్ట్స్ మీట్‌లో షటిల్ ఆడుతున్న వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్

విశాఖ సిటీ: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ పేర్కొన్నారు. వీఎంఆర్‌డీఏ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆంధ్ర విశ్వకళా పరిషత్ జిమ్నాజియం ఇండోర్ స్టేడియంలో ఉద్యోగులకు నిర్వహించిన స్పోర్ట్స్ మీట్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్లాడుతూ ఉద్యోగులు మరింత ఉత్సాహంగా విధులు నిర్వహించడానికి ఇటువంటి స్పోర్ట్స్ మీట్‌లు ఎంతో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి దాట్ల కీర్తి, సంయుక్త కమిషనర్ రవీంద్ర, ముఖ్య గణాంకాధికారి హరిప్రసాద్, డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ శాంతి స్వరూప్, ప్రధాన ఇంజినీర్ భవానీశంకర్, వీకేసీపీఐఆర్ జాయింట్ డైరెక్టర్ శిల్ప, కార్యనిర్వాహక ఇంజినీర్లు రామరాజు, రాంబాబు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నీటికి అడ్డంగా చెత్త మూటలు



ముడసర్లోవ రిజర్వాయర్ వరద నీరు చేరే మార్గంలో చెత్త మూటలు

ఆరిలోవ: ముడసర్లోవ రిజర్వాయర్‌లోకి వరద నీరు చేరే మార్గం చెత్త మూటలతో నిండిపోతోంది. ఇప్పటికే దీనికి నీటి దారులు పలుచోట్ల మూసుకుపోయాయి. వర్షాలు కురిసేటప్పుడు కంబాల కొండల వెనుక భాగం నుంచి వరద నీరు రిజర్వాయర్‌లోకి చేరడానికి పలుచోట్ల మార్గాలు, కంబాల కొండల నుంచి వరద నీరు రావడానికి కల్వర్టులు ఏర్పాటు చేశారు. సింహాచలం కొండల నుంచి రెండు చోట్ల బీఆర్‌టీఎస్ కింద నుంచి కల్వర్టులు నిర్మించారు. ఇందులో ఒకటి మూసుకుపోయింది. ముడసర్లోవ పార్కు సమీపంలో ఉన్న రెండో కల్వర్టులో కొందరు చెత్త మూటలు వేసేస్తున్నారు. వాటితోపాటు పవిత్ర దినాల్లో ఇంట్లో పూజలు చేసిన అనంతరం పుష్పాలతో కూడిన సామగ్రిని దీనిలో వేస్తున్నారు. దీంతో ఇది మూసుకుపోయింది. ఈ చెత్తను శానిటరీ సిబ్బంది తొలగించకుండా వదిలేస్తున్నారు. ఈ మూటలు కుళ్లిపోవడంతో అటుగా నిత్యం నడక కోసం వెళ్లేవారు దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. భారీ వర్షాలు కురుస్తున్నప్పుడు కొండలపై నుంచి వరద నీటితో ఈ చెత్త మూటలు రిజర్వాయర్‌లోకి చేరుతున్నాయి. దీంతో నీరు కలుషితమవుతోంది. శానిటరీ సిబ్బంది కల్వర్టులో చెత్తను తొలగించాలని, చెత్త వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని వాకర్స్, స్థానికులు కోరుతున్నారు.

మతిస్థిమితం లేని మహిళకు ఆశ్రయం



ఏయూటీడీ వసతి గృహానికి మహిళను అప్పగిస్తున్న ఆరిలోవ పోలీసులు

ఆరిలోవ: అర్ధరాత్రి సమయంలో ఒంటరిగా రోడ్డుపై తిరుగుతున్న మతిస్థిమితం లేని ఓ మహిళను ఆరిలోవ పోలీసులు నిరాశ్రయుల వసతి గృహంలో చేర్పించారు. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఆదివారం రాత్రి పోలీస్ కమిషనర్ నగరంలోని పలు ప్రాంతాలు, బీచ్ రోడ్డులో పర్యటించారు. అర్ధరాత్రి దాటి 2 గంటల సమయంలో జోడుగుళ్లపాలెం వద్ద రోడ్డుపై వర్షంలో తడుస్తూ మతిస్థిమితం లేని ఓ మహిళను ఆయన గుర్తించారు. వెంటనే వాహనం ఆపి మహిళను పరిశీలించారు. ఆమె మాట్లాడలేకపోవడం, సరిగా సమాధానం చెప్పలేకపోవడంతో సిబ్బందితో సంబంధిత పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఆ మహిళకు రక్షణ కల్పించాలని ఆదేశించారు. దీంతో ఆరిలోవ పోలీసులు మహిళా సిబ్బందితో వెళ్లి జోడుగుళ్లపాలెంలోని అవుట్‌పోస్టుకు ఆమెను తరలించారు. అనంతరం ఆ మహిళను ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని ఏయూటీడీ స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తున్న వసతి గ్రహంలో ఆమెను చేర్పించారు.

వ్యక్తి ఆత్మహత్య



రుషికొండ బీచ్‌లో రమేష్ మృతదేహం

ఆరిలోవ: ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. జీవీఎంసీ 10వ వార్డు రవీంద్రనగర్‌లో కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్న ఎం.రమేష్(44) కొన్నాళ్లుగా పలు వ్యాధులతో బాధపడుతున్నాడు. అతడికి కొద్ది కాలంగా మతిస్థితి కూడా సరిగా లేదు. దీంతో ఇంటి నుంచి బయటకు వెళ్లి వారం, పది రోజుల వరకు తిరిగి వచ్చే వాడు కాదు. ఇలా పలు సార్లు జరిగింది. ఇదే మాదిరిగా నాలుగు రోజుల కిందట ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఎప్పటిలాగే తిరిగి ఇంటికి వస్తాడనుకునే రమేష్ కుటుంబీకులకు సోమవారం విషాదం ఎదురైంది. రుషికొండ బీచ్‌లో రమేష్ మృతదేహం ఉన్నట్లు స్థానికుల ద్వారా తెలుసుకున్నారు. అనారోగ్యం ఉండటం, మతిస్థిమితం లేకపోవడంతో ఆత్మహత్య చేసుకుని ఉంటాడని కుటుంబ సభ్యులు భావించి ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలి



నినాదాలు చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

సీతమ్మధార: ఇసుక, సిమెంట్, ఐరన్ ధరలు తగ్గించి భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలని ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు జి.వామనమూర్తి డిమాండ్ చేశారు. భవన నిర్మాణ సామగ్రి ధరలు తగ్గించాలని, సెప్టెంబర్ 3న విశాఖలో నిర్వహించే కార్మిక ప్రదర్శన, బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం సీతమ్మధార అల్లూరి సీతారామరాజు జంక్షన్ వద్ద ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలను వెంటనే ఆపాలన్నారు. ప్రభుత్వాలు కార్మికులకు రోజుల తరబడి ఉపాధి లేకుండా చేస్తున్నాయని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం భారీగా పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించి కార్మికుల కుటుంబాలను ఆదుకోకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కె.శంకర్, ఎస్.పాపారావు, పి.గణపతి, జి.సత్యం, డి.రాము తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ చెల్లింపులో అసమానతలు తొలగించాలి



విశాఖ జిల్లా బ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల సమాఖ్య నూతన కార్యవర్గ సభ్యులు

దాబాగార్డెన్స్: విశాఖ జిల్లా బ్యాంక్ విశ్రాంత ఉద్యోగుల సమాఖ్య ప్రారంభ సమావేశం సోమవారం దాబాగార్డెన్స్‌లో గల అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సమాఖ్య అధ్యక్షుడు బీవీవీ కొండలరావు, ప్రధాన కార్యదర్శి ఎల్లారావు మాట్లాడుతూ పెన్షన్ సవరణ, ఇన్సూరెన్స్ ప్రీమియం తగ్గింపు, ఫ్యామిలీ పెన్షన్ పెంపుదల, కనీస పెన్షన్ పెంపుదల, ఆరోగ్య బీమాపై జీఎస్టీ తొలగింపు, దేశ వ్యాప్తంగా గల 6 లక్షల మంది విశ్రాంత ఉద్యోగుల పెన్షన్ చెల్లింపులు ఉద్యోగ సంక్షేమ నిధి నుంచి కాకుండా సంబంధిత బ్యాంకులే స్వయంగా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆర్‌బీఐ విశ్రాంత ఉద్యోగులతో సమానంగా పెన్షన్ చెల్లించాలని, పెన్షన్ చెల్లింపులో అసమానతలు తొలగించాలని కోరారు. విశ్రాంత ఉద్యోగులు సామాజిక సేవలో భాగస్వాములవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏపీ విశ్రాంత ఉద్యోగ సమాఖ్య సంయుక్త కార్యదర్శులు పి.వీరారెడ్డి, వి.జగన్మోహనరావు, జి.రామచంద్రరావు, ఆర్‌వీ రవికుమార్, కె.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఎన్నుకున్నారు. సమాఖ్య గౌరవ అధ్యక్షుడిగా ఎ.కోటేశ్వరరావు, అధ్యక్షుడిగా పి.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా ఆర్‌వీ రవికుమార్, ఉపాధ్యక్షులుగా ఐ.కేశవరావు, జి.రామచంద్రరావు, పి రాఘవరావు, ఎంఎస్ భాస్కరరావు, సాగర్, కోశాధికారిగా పి.మృత్యుంజయరావుతోపాటు 25 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

భజరే నందగోపాల హరే..

- వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు
- రాధాకృష్ణుల వేషధారణల్లో అలరించిన చిన్నారులు



తోటగరువు శ్రీకృష్ణ ఆలయం వద్ద చిన్నికృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారుల సందడి



ఎంవీపీ కాలనీలో రాధాకృష్ణుల వేషధారణల్లో అలరిస్తున్న చిన్నారులు



పాత ఆరిలోవ మండపంలో శ్రీకృష్ణుడికి పూజలు చేస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలో సోమవారం శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. మందిరాల్లో నందగోపాలుడిని భక్తులు కుటుంబ సమేతంగా దర్శించుకుని మనసారా పూజలు చేశారు. వివిధ చోట్ల శ్రీకృష్ణుడి మండపాలు ఏర్పాటు చేసి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. పాత ఆరిలోవ, తోటగరువు, పెదగదిలి, చినగదిలి, ముడసర్లోవ పార్కు, హనుమంతవాక ప్రాంతాల్లో వివిధ ఆకారాల్లో మండపాలను ఏర్పాటు చేసి విద్యుత్ దీపాలు, రంగులుతో అలంకరించారు. పాత ఆరిలోవలో యశోద బాలగోపాల యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాల్లో మేయర్ గొలగాని హరివెంకటకుమారి, వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్, ఉత్సవ కమిటీ సభ్యులు కృష్ణయ్యను దర్శించుకుని పూజలు చేశారు. ముడసర్లోవ పార్కులో శ్రీకృష్ణుడి విగ్రహం వద్ద మేయర్ హరి వెంకటకుమారి, 12వ వార్డు కార్పొరేటర్ అక్కరమాని రోహిణి, స్థానికులతో కలిసి పూజలు జరిపారు. పెదగదిలిలో బాలమురళీకృష్ణ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో మాజీ కార్పొరేటర్ ఒమ్మి సన్యాసిరావు, సంఘ సభ్యులు పూజలు చేశారు. తోటగరువులోని శ్రీకృష్ణ ఆలయంలో ఆలయ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులు రాధాకృష్ణులు, గోపికల వేషధారణల్లో భక్తులను అలరించారు. పిల్లల సందడితో ఆలయ ప్రాంగణం కళకళలాడింది.

ఉత్సాహంగా ఉట్టి కొట్టిన చిన్నారులు

ఎంవీపీకాలనీ: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఎంవీపీ కాలనీలోని కిడ్జ్ గార్డెన్ స్కూల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పలు తరగతుల చిన్నారులు శ్రీకృష్ణ, రాధా, రుక్మిణి, సత్యభామల వేషధారణలతో అలరించారు. ఉట్టి కొట్టే కార్యక్రమంలో విద్యార్థులంతా ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ సాయిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

- ఎంవీపీ కాలనీ శ్రీ సత్యసాయి విద్యావిహార్‌లో రాధాకృష్ణులు, గోపికల వేషధారణలో చిన్నారులు అందరినీ అలరించారు. కృష్ణుడి పుట్టుక నుంచి జీవిత విశేషాలను తెలియజేస్తూ ప్రదర్శనలు చేశారు. వేడుకల్లో స్కూల్ ప్రిన్సిపాల్ చేకూరి వరలక్ష్మి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



28వ వార్డులో ఉట్టి సంబరం ప్రారంభిస్తున్న పల్లా దుర్గారావు



గోకుల్ పార్క్ చక్రం వద్ద ఫొటోకు పోజ్ ఇస్తున్న చిన్నికృష్ణుడు



కిడ్జ్ గార్డెన్ స్కూల్‌లో ఉట్టి కొడుతున్న చిన్నికృష్ణులు

సాగరతీరంలో చిన్నికృష్ణుల సందడి

బీచ్‌రోడ్డు: సాగరతీరంలో చిన్నికృష్ణులు సందడి చేశారు. తల్లిదండ్రులు వారి పిల్లలకు కృష్ణుడు, గోపికల వేషాలు వేసి తీరంలో తిరుగుతూ... ఫొటోలు తీస్తూ ఎంజాయ్ చేశారు. గోకుల్ పార్క్ రాధాకృష్ణ దేవాలయానికి వెళ్లి పూజలు చేశారు. వారిని సందర్శకులు చూసి ముచ్చటించారు.

- 28వ వార్డు పితానిదిబ్బ గోకుల యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో ఉట్టి సంబరం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. యువకులు ఎంతో ఉల్లాసంగా పోటీ పడుతూ ఉట్టి కొట్టారు. సంఘ అధ్యక్షులు త్రినాథ్‌రావు, సంపంగి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వీవీవైఎం నూతన కార్యవర్గం



వీవీవైఎం నూతన కార్యవర్గ సభ్యులు

మురళీనగర్: విశాఖ వివేకానంద యువ మహా మండలి (వీవీవైఎం) నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసినట్లు మండలి ప్రతినిధి హృదయ్ తెలిపారు. అధ్యక్షుడిగా కవిటి లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడిగా బాచిన శ్రీధర్, కార్యదర్శిగా చంద్రశేఖర్, సహాయ కార్యదర్శులుగా డీఎస్ మూర్తి, ఎ.శ్రీనివాస్, కోశాధికారిగా ఎం.పల్లారావు, కార్యవర్గ సభ్యులుగా కె.హృదయ్, జోగారావు, నందమూరి, ఆర్.దేముడునాయుడు, శాశ్వత ప్రతినిధిగా డి.వెంకటరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆయన చెప్పారు. ఈ సందర్భంగా కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.